# రైల్లో

సాయంత్రం ఆరవుతుంది.

'ఇంకా అరగంటే టైమున్నది. వెంటనే బయలు దేరాలి' అన్నాడు అన్నయ్య.

ఇరవై నిమిషాలో కలకత్తామెయిల్ థర్డుక్లాస్‌లో అడుగుపెట్టాను.

పెట్టె నిండిపోయివున్నారు జనం. ఒకరినెత్తిన వకరు. ఎక్కడా సందు లేదు. వూపిరి ఆడటంలేదు. అప్పుడే ఓమూల సన్నగా యుద్ధం ఆరంభమైంది. ఇంక సామానుకు అంతు లేదు. ఆ పెట్టెలో జనం ఎక్కువ వున్నారో, సామాను ఎక్కువ వుందో నిర్ణయించటం కష్టం. బెదురుతూ తలుపు దగ్గరే నిల్చున్నాను. అన్నయ్య లోపలికి తొంగిచూశాడు.

'ఇక్కడ ఎలా కూర్చుంటావు? పోనీ, ఇంటరుకు మార్చుకురానా?'

'ఊహుఁ. ఇక్కడే కూర్చుంటాను. ఫరవాలేదు. రైలు కదిలితే అంతా సర్దుకుంటారు. అందరూ స్నేహమౌతారు' అన్నాను పట్టుదలతో. ఎదురుగా బల్లమీద ఒక ఆకుపచ్చ చీరె ఆవిడ సీటుమీద పరుపు పెట్టుకొని హాయిగా కూర్చున్నది. నన్నుచూచి 'రండి, కూర్చోండి' అన్నది పరుపు తీస్తూ. అన్నయ్యకు ధైర్యం వచ్చింది.

'మా చెల్లెలు రాజమండ్రిదాకా వెళ్ళుతున్నది. కొంచం చూసుకుంటారా'

'అల్లాగే నాయనా! నేనూ రాజమండ్రి వెళ్ళు తున్నాను.'

అన్నయ్య వెళ్లిపోయాడు. ఆకుపచ్చ చీరావిడ 'మీా దీవూరేనా' అంటూ మొదలుపెట్టి మామూలు ప్రశ్నలన్నీ వేసి రాజమండ్రి మా పుట్టిల్లో, అత్తవారిల్లో అన్నీ సవిస్తారంగా కనుక్కుంది. అన్నింటికి ముభావంగా జవాబు చెప్పి వూరుకున్నాను. ఆమె ప్రశ్నలలోంచి తేరుకోని పెట్టెఅంతా కలయజూశాను. కిటికీలోనుంచి ఒక బెంగాలీ అమ్మాయి యెవరో బెంగాలీ యువకుడితో జాలిచూపులతో మాట్లాడు తున్నది. వారి విచారవదనాలు చూస్తే వియోగం భరించ లేనట్లు తోస్తుంది. భార్యాభర్తలై వుంటారా? ఒక్కక్షణం వారి కథ వూహించుకున్నాను. ఆమె కలకత్తా పుట్టింటికి వెళ్ళుతున్నది. అతను సెలవుదొరక్క ఆగిపోయాడు. నవ్వు వచ్చింది. ప్రక్కకు తిరిగి చూశాను. అరవసోదరి, పిల్లలూ కాఫీ ఫలహారాల్లో మునిగితేలుతున్నారు. రైలు యెక్కింది మొదలు తినడమే పనిగదా! పాపం! దూరాన అవ్వగారు చోటులేదని సణుగుతున్నది. గంట మ్రోగింది.

అమ్మయ్య! రైలు కదులుతుంది కదా, ఇంకెవరూ ఈ పెట్టెలోకి రారుకదా, అని అందరి ముఖాలు వికసించినవి. కాని ఒక నల్లని ఆసామీా గబగబా వచ్చి తలుపుతెరచి, ఒక పసిపిల్లతల్లినీ, పెట్టె, పక్కచుట్టతో సహా లోపలికి తోసి వెళ్ళాడు.

రైలు కదలింది.

క్రొత్తావిడ, పసిబిడ్డ నెత్తుకొని తలుపుదగ్గరే దిక్కు లేనిదానిలాగ నించున్నది. అంతా ఆవిడకేసి ద్వేషంతో చూస్తున్నారు. ఆకుపచ్చచీరావిడ మాత్రం సర్దుకొని మా యిద్దరిమధ్యా చోటిచ్చింది.

నాకు ఆశ్చర్యంవేసింది.

తనకు యిబ్బందిఅనిఅయినా ఆలోచించకుండా ఈ విడ వచ్చినవాళ్ళందరికీ చోటుయిస్తున్నది: రైల్లో, చోటు వున్నాకూడ, చోటులేదు, యింకో పెట్టెలోకి వెళ్ళమని కసిరేవాళ్ళను, సీటుమీద సామానుపెట్టి రాత్రి నిద్రకు స్థలం రిజర్వుచేసుకొని, తియ్యమన్న ప్రతివారితో పోట్లాడే వాళ్ళను, ప్రక్కనున్నవాళ్ళను కారణం లేకుండానే తోస్తూ హింసించేవాళ్ళను చాలామందిని యెరుగుదును. కాని తనకు యిబ్బంది అని అయినా ఆలోచించకుండా పెట్టె లోకివచ్చే ప్రతివ్యక్తికి చిరునవ్వుతో స్వాగతమిస్తూ చోటు చూపించే స్త్రీని చూడటం ఇదేమొదటిసారి. సిగ్గుపడుతూ అన్నాను.

'ఏమండీ, నామూలాన మీకు చాలా యిబ్బంది అయింది. పాపం, ఇంక మీరు రాత్రిఅంతా మేలుకోవాలి.'

ఆకుపచ్చచీరావిడ నవ్వింది.

'ఫరవాలేదండీ, నిద్రకోసం వాచిపోయినామా? ఎంతసేపు, తెల్లవారితే యెవరింటికి వాళ్ళం వెళ్ళిపోతాము. రేపు రోజంతా నిద్రపోవచ్చు. ఇక్కడే వుండిపోముగదా! ఉన్నకాస్సేపు ఒకరికొకరం సాయంచేసుకోకపోతే ఎల్లాగ?'

నేను ఆవిడకేసి నిదానించిచూశాను. మామూలు మనిషే, నలభైయేళ్లుంటాయి. సగంజుట్టు నెరిసింది. వంటి నిండా నగలు. చామనచాయ. ఎందుకో నడివయస్సులో నగలతోనిండిన స్త్రీలను చూస్తే విచారం నాకు. సంస్కారము లేక సంసారగొడవల్లోమునిగి స్వార్థపరులైవుంటారని యేదో పిచ్చివూహ. కాని, ఇవ్వాళ ఈమె సహజఔదార్యంముందు నా సంస్కారం తలవంచుకున్నది.

రైలు నెల్లూరు దాటింది.

ఎల్లాగో ఎక్కడివాళ్ళక్కడ సర్దుకొని నిద్రకు సిద్ధమైనారు.

ఆకుపచ్చ చీరావిడ లేచినుంచునిక్రొత్తావిడతోఅన్నది.

'పిల్లను పడుకోబెట్టండి. నేను ఆ ప్రక్కన సర్దుకుంటాను'

ఆ తల్లి కృతజ్ఞతతో పిల్లను నిద్రపుచ్చింది.

ఎక్కడాచోటులేదు, చాదస్తం. ఎక్కడకూర్చుంటుంది?

'అదేమిటండీ, ఎక్కడా చోటులేదే. ఎంతసేపు నించుంటారు?' అన్నాను.

'ఫరవాలేదు. పిల్లను చేతిలో పెట్టుకొని ఆమె ఎంత సేపు కూర్చుంటుంది. ఎవరో ఒకరు కష్టపడాల్సిందేగా. అందరం పంచుకుందాం.'

నేను సిగ్గుపడ్డాను, నా కెందుకు తోచలేదు?

'మీ రిక్కడ కూర్చోండి, నేను వెళ్ళి తలుపుదగ్గర నిల్చుంటాను, నాకు కిటికీలోనుంచి చూడటం చాలాసరదా' అన్నాను లేస్తూ. ఆమె ఒప్పుకో లేదు.

'చిన్నదానివి. నీవు నిద్రపో, నాకు ఫరవాలేదు'

ఎట్లాగో బలవంతంమీద ఆమెను కూర్చోపెట్టి నేను తలుపు దగ్గరికి చేరాను.

ఎప్పుడు రైల్లోవున్నా నాకు కిటికీదగ్గరనుంచి బయట ప్రకృతినీ, లోపల మనుష్యప్రకృతినీ చూస్తూ కాలం గడపటం సరదా. కాని యీ చీకటిలో బయటప్రకృతి నిర్జీవమైంది లోపల మానవలోకం నిద్రపోతున్నది. బయట మిణుగురులు ధగధగ మెరుస్తూ మాయమౌతున్నవి. లోపల బెంగాలీ యువతి కళ్ళు కన్నీటితో తళతళలాడుతూ ఎవరినో వెతుక్కుంటున్నాయి. నేను ఊహాప్రపంచంలో మునిగిపోయాను. నిల్చునే నిద్రపోయినానేమో!

తెల్లవారింది.

పెట్టె కలకలలాడింది.

గోదావరి హోరు! బ్రిడ్జిమీద రైలుప్రవాహ!

అమ్మయ్య! రాజమండ్రి!!!